పాలేరు కాలువపై రాత్రి చలిమంట వేసుకొని కాపలా కాస్తున్న రైతులు

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

పాలేరు రిజర్వాయర్ వద్ద రాస్తారోకో • ఒకట్రెండు తడులకైనా ఇవ్వాలని డిమాండ్

అనధికారికంగా గేట్లెత్తి దిగువకు నీటి విడుదల • పోలీసులు, ఇరిగేషన్ అధికారుల జోక్యం

కూసుమంచి, ఫిబ్రవరి 27: ఖమ్మం జిల్లా కూసుమంచి మండల పరిధిలోని పాలేరు జలాశయం కింద పంటలు సాగు చేస్తున్న రైతులు మంగళవారం రోడ్డెక్కారు. ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. దీంతో రిజర్వాయర్ వద్ద ఉద్రిక్తత నెలకొన్నది. కూసుమంచి, నేలకొండపల్లి మండలాల ఆయకట్టు 90 శాతం ఈ రిజర్వాయర్ జలాలపైనే ఆధారపడి ఉంటుంది. ఆయా మండలాల్లో ప్రస్తుత యాసంగిలో సాగవుతున్న పంటలను కాపాడుకునేందుకు ఇటీవల ఆయకట్టు రైతులు పాలేరు రిజర్వాయర్ వద్దకు వచ్చి నీటి కోసం ఆందోళన చేపట్టారు. పాతకాలువ నుంచి జలాలను దిగువకు వదిలారు. అధికారులు, పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం ఇరిగేషన్ అధికారులు పాతకాలువ గేట్ల వద్ద ముళ్లకంప వేశారు. ఇది జరిగి రెండు వారాలు కాకముందే.. రైతులు స్థానిక రాజకీయ నాయకులతో కలిసి మంగళవారం మరోసారి ఆందోళనకు దిగారు. రిజర్వాయర్ పాత కాలువ గేట్ల వద్దకు వెళ్లి ముళ్లకంపను తొలగించారు. రిజర్వాయర్ కట్టపై నుంచి వాహన రాకపోకలను అడ్డుకుని రాస్తారోకో చేశారు. గేట్లను తెరిచి దిగువకు జలాలు వదిలారు. సమాచారం అందుకున్న ఏసీపీ బీ తిరుపతిరెడ్డి, ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి, ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ ఆనంద్, ఈఈలు మంగలపుడి వెంకటేశ్వర్లు, అనన్య, డీఈలు రత్నకుమారి, మధు, మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాసరావు, డీఈ మురళీకృష్ణ రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. కొన్ని గంటలపాటు రైతులతో చర్చలు జరిపారు. ఇరిగేషన్‌శాఖ సీఈ విద్యాసాగర్ బుజ్జగించడంతో రైతులు ఆందోళనను విరమించడంతో ఇరిగేషన్ అధికారులు పాతకాలువ గేట్లను మూసివేశారు. అయితే.. రైతులు తమ ఇండ్లకు వెళ్లకుండా మంగళవారం రాత్రి పాలేరు రిజర్వాయర్ కాలువపైకి వచ్చి ఆందోళన చేశారు. అధికారులు గేట్లకు వెల్డింగ్ పెట్టకుండా అడ్డుకొని అక్కడే చలిమంటలు వేసుకొని కాపలా ఉన్నారు.

కర్ణాటకతో చర్చించి కృష్ణా జలాలు తేవాలి

- 15 టీఎంసీల నీళ్లు తెచ్చి పంటలను కాపాడాలి
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ ఆయకట్టులో ఎండుతున్న పంటలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి కృష్ణా జలాలు తీసుకురావాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రైతులు ఆశతో వరి సాగు చేశారని, ప్రస్తుతం ఆ పంట ఎండిపోయే దశలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఒక్క తడికైనా సాగునీరు ఇవ్వగలిగితే పంటను కాపాడేందుకు అవకాశం ఉందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం నల్లగొండలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దురదృష్టవశాత్తు ప్రకృతి సహకరించక ప్రస్తుతం కరువు పరిస్థితులు నెలకొన్నాయని, ఈ పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాలని సూచించారు. బోర్లు ఎండిపోయి నల్లగొండ కష్టాల్లో ఉన్నారని చెప్పారు. కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి కృష్ణా జలాలను తీసుకొచ్చే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని కోరారు. తాగునీటి ఎద్దడి రాకుండా జలాశయాల్లో తగినన్ని నీటి వనరులను అందుబాటులో ఉంచేలా చూడాలని తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి పార్టీ ఆదేశాల మేరకు నడుచుకుంటాడని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అందరూ కలిసికట్టుగా పని చేస్తామంటే పోటీకి సిద్ధమని, లేదంటే పార్టీ ఎవరిని అభ్యర్థిగా నిలిపినా వారి గెలుపు కోసం పని చేస్తామని స్పష్టం చేశారు.

దాహార్తిలోనూ లాభనష్టాలా?

- సర్కారు అంటే రియల్ ఎస్టేట్ సంస్థా?
- ప్రజల యోగక్షేమాలను లాభనష్టాలతో పోలుస్తారా?
- మిషన్ భగీరథలోనూ లాభం వెదికేవాడు ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరం
- సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్

"ప్రభుత్వమంటే రియల్‌ఎస్టేట్ వ్యాపారం కాదు. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరు. ప్రజల ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కోసం పెట్టే ఖర్చులో కూడా లాభం తీయాలనుకునేవారు వ్యాపారులు అవుతారు తప్ప పాలకులు కారు. మిషన్‌భగీరథలో లాభం వెతికేవాడు ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టం.

-హరీశ్‌రావు, ఎమ్మెల్యే

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ప్రజలకు అందించే స్వచ్ఛమైన మిషన్ భగీరథ తాగునీటి విషయంలోనూ లాభనష్టాలను బేరీజు వేసే ముఖ్యమంత్రి ఉండటం దురదృష్టకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం అంటే రియల్‌ఎస్టేట్ సంస్థా? అని ప్రశ్నించారు. ప్రజల యోగక్షేమాలను లాభనష్టాలతో పోల్చేవారు వ్యాపారవేత్తలు అవుతారే తప్ప పాలకులుకారని చురకలేశారు. మిషన్ భగీరథ పథకంపై సీఎం చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు నిరంతరం సురక్షితమైన మంచినీరు అందించాలనే గొప్ప ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని తెచ్చిందని వివరించారు. ఈ పథకం ప్రభుత్వానికి లాభం తెచ్చే పని కాదు కనుకనే మిషన్ భగీరథ దండుగ అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారని మండిపడ్డారు.

50వేల కోట్లని ఎలా చెప్తారు?

మిషన్ భగీరథ పథకం కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తే, దానిని రూ.50 వేల కోట్లకు పెంచి చెప్పున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మిషన్ భగీరథపై కాంగ్రెస్ సర్కారుకు ఉన్న భావదారిద్ర్యానికి ఇంతకన్నా నిదర్శనం మరొకటి లేదని మండిపడ్డారు.

సాగునీరులోనూ సర్కారు లాభనష్టాలా?

కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టారు కానీ, ఫలితం లేదని పదే పదే విమర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తీరును హరీశ్‌రావు తీవ్రంగా ఆక్షేపించారు.

లాభం లేదని రైతుబంధును రద్దుచేస్తారా?

కొన్ని పెట్టుబడులకు ప్రత్యక్షంగా లాభం వస్తే మరికొన్నింటికి పరోక్ష ఫలితాలు ఉంటాయని హరీశ్‌రావు స్పష్టంచేశారు. 'ఆసరా పెన్షన్ల ద్వారా కూడా వేల కోట్లు ఖర్చు అవుతుంది. వీటివల్ల లాభం లేదంటారా? రైతుబంధును లాభం లేని పథకమని రద్దు చేస్తారా? ఆరోగ్యశ్రీ, ఫీజు రీఎంబర్స్‌మెంట్, రేషన్ దుకాణాల్లో ఉచిత బియ్యం లాంటి పథకాల వల్ల కూడా ప్రత్యక్ష లాభం కనిపించదు కాబట్టి వాటిని రద్దు చేస్తారా?' అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ప్రజలకు ఎత్తులతో పనిలేదు?

ఎవరి ఎత్తు ఎంతో ప్రజలకు తెలుసని హరీశ్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రతిసారీ తన ఎత్తును ప్రస్తావించడంపై ఆయన స్పందించారు. 'నేను కూడా మీ ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరెంత ఆలోచిస్తున్నారో, ఎవరెంత పనిచేస్తున్నారో మాత్రమే వారికి అవసరం' అని వ్యాఖ్యానించారు.

వీటికి బదులేదీ?

- తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడకముందు రాష్ట్రంలో మంచినీటి సౌకర్యం ఉన్న జనావాసాల సంఖ్య 5,672. 2023 చివరి నాటికి వాటి సంఖ్య 23,930. ఇది నిజం కాదా?
- 2014కు ముందు 30% ఇండ్లకు మాత్రమే నల్లాల ద్వారా తాగునీరు అందేది. ఇప్పుడు 100% అయిన మాట నిజమా? కాదా?
- 1956 నుంచి 2014 వరకు ఉన్న ప్రభుత్వాలు మొత్తంగా 41 లక్షల కొత్త ఆయకట్టుకు మాత్రమే నీరు అందిస్తే, గడిచిన తొమ్మిదిన్నర రేండ్లలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం 48 లక్షల ఎకరాలకు నీరు అందించిందని ఆధారాలతో సహా చెప్పినా వినిపించుకోకపోతే ఏమనాలి?
- 2014-15లో 1.31 కోట్ల ఎకరాల్లో పంట సాగు అయితే, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించడం వల్ల 2022-23 నాటికి ఆ విస్తీర్ణం 2.08 కోట్ల ఎకరాలకు చేరింది.
- రాష్ట్రం ఆవిర్భావానికి ముందు 1.98 లక్షల టన్నుల మత్స్య సంపద ఉంటే అది ప్రస్తుతం 4.24 లక్షల టన్నులకు పెరిగింది నిజం కాదా? తద్వారా ఎంతోమందికి ఉపాధి లభించడం లాభం కాదంటారా?
- ప్రాజెక్టుల ద్వారానే మంచినీటికి కొరత లేకుండా నిండువేసవిలో కూడా నల్లాల ద్వారా మంచినీరు ఇవ్వగలుగుతున్నాం.
- తెలంగాణలోని వేలాది పరిశ్రమలకు నిరంతరాయంగా ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇవ్వగలుగలగడం లాభం కాదా?
- ఎఫ్ఆర్‌బీఎం పరిమితి 25% అయితే, తెలంగాణ అప్పు 23.8 శాతమే అనే విషయం మీకు తెలియదనుకోవాలా?
- అప్పుల గురించి మాట్లాడుతున్న వారు 2024-25 బడ్జెట్‌లో లోటును అప్పుల ద్వారా సమకూర్చుకుంటామని ఎందుకు చెప్పారు?
- ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కూడా కాకముందే వేల కోట్ల అప్పులు ఎందుకు తెచ్చారు?

112 మంది డాక్టర్లకు ఉద్వాసన?

మూడు నెలలుగా విధులకు దూరం

విద్యార్థులకు, వైద్య సేవలకు తీవ్ర అంతరాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న దాదాపు 112 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఉద్యోగాల్లో నుంచి తొలిగించాలని వైద్యారోగ్యశాఖ నిర్ణయించింది. వీరు ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా దీర్ఘకాలికంగా విధులకు దూరంగా ఉంటున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. వారి గైర్హాజరు కారణంగా అటు వైద్యవిద్యార్థులకు తరగతులు జరగకపోగా, ఇటు అనుబంధ దవాఖానల్లో వైద్యసేవలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. మరోవైపు ప్రొఫెసర్ల హాజరు తక్కువగా నమోదవడం, అనుబంధ దవాఖానల్లో ఓపీ తక్కువగా నమోదవుతుండటంతో ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం ఇబ్బంది ఎదురవుతున్నది. ఈ నేపథ్యంలో గుదిబండగా మారినవారిని సర్వీస్ నుంచి తొలగించాలని వైద్యశాఖ నిర్ణయించినట్టు సమాచారం.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం

కల్యాణలక్ష్మి బంగారమేది?

రేవంత్ సర్కార్‌ఎమ్మెల్యే పోచారం ఫైర్

బాన్సువాడ, ఫిబ్రవరి 27: 'ఆడబిడ్డల పెండ్లిండ్లకు రూ.లక్ష నగదుతోపాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఆ బంగారం ఎక్కడ దాచిందో గానీ.. అధికారంలోకి వచ్చి రెండున్నర నెలలు దాటినా ఇప్పటికీ ఆ ఊసే లేదు' అని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన 222 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	17.2°c	35.7°c
మెదక్	18.3°c	32.8°c
ఆదిలాబాద్	19.9°c	35.7°c
హైదరాబాద్	20.7°c	33.7°c
వరంగల్	21.0°c	34.0°c
కరీంనగర్	21.0°c	33.0°c
ఖమ్మం	21.0°c	36.0°c
నిజామాబాద్	21.3°c	33.6°c
మహబూబ్‌నగర్	21.6°c	35.6°c
నల్లగొండ	24.2°c	35.7°c

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): 'ప్రజావాణి'లో సామాన్యుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ప్రజావాణి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులకు చిన్నారెడ్డి సూచించారు.

ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని ఫీజు వసూలా?

- ప్రజలకు మోసపూరిత హామీ ఇచ్చినందుకు క్షమాపణ చెప్పాలి
- కాంగ్రెస్ సర్కారు తీరుపై హరీశ్ ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఎల్ఆర్ఎస్‌ను రద్దుచేసి ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ మాట మార్చి మడమ తిప్పిందని, ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నో ఎల్ఆర్ఎస్-నో బీఆర్ఎస్' అంటూ గతంలో ప్రజలను రెచ్చగొట్టి ఇప్పుడు ఫీజులు వసూలు చేస్తామనడం కాంగ్రెస్ నేతల మోసపూరిత మాటలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, గతంలో తాము చేసిన ప్రకటనకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలుచేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఒక్క నెలలో వంద బోర్లు

ఏ బాయికాడ చూసినా క్రేన్లే • మళ్లీ కష్టాల్లో కూరుకుపోతున్న అన్నదాత

20 బోర్లలో చుక్కనీరు రాలె • సాగునీటికి ఏదుట్ల రైతుల తిప్పలు • అడుగంటుతున్న భూగర్భ జలాలు..

వనపర్తి/నల్లగొండ ప్రతినిధి, ఖమ్మం, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): వనపర్తి జిల్లాలో యాసంగి సాగుబడులు చేసిన రైతులు నరకయాతన అనుభవిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎదురుకాని సాగునీటి సమస్య కాంగ్రెస్ సర్కారు వచ్చాక అడుగడుగునా కనిపిస్తున్నది. జిల్లాలోని సాగునీటి కాల్వలు రెండు నెలల ముందే వట్టిపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వేసిన పంటలు చేతికి అందుతాయో లేదోనన్న ఆందోళనలతో కొత్త బోర్లు వేసుకునేందుకు పరుగులు పెడుతున్నారు. గతంలో పుష్కలంగా నీరందించిన వ్యవసాయ బోర్లు నేడు ఎక్కడికక్కడ ఎండిపోతుండటం రైతులను నివ్వెరపరుస్తుంది.

ఎండుతున్న బోర్లు

దశాబ్దకాలం పాటు కాలువల నీటితో కళకళలాడిన వ్యవసాయం మళ్లీ ఎనకటి రోజుల్లోకి వెళ్తున్నదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా యాసంగిలో 1.19 లక్షల ఎకరాల్లో పంటలు సాగైతే అందులో వరి 83,820 ఎకరాలు, వేరుశనగ 21,286, పెసర 12,434 ఎకరాల్లో సాగు చేశారు. మరో 2 వేల ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న తదితర పంటలను వేసుకున్నట్టు అంచనా.

అగమ్యగోచరంగా 'సాగర్' రైతన్న

నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో రైతన్న పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. యాసంగిలో సాగుచేసిన వరి పంట కండ్ల ముందే ఎండుతుంటే రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు కొత్తగా బోర్లు, బావులు తవ్వుతున్నా భూగర్భజలాలు అడుగంటుతుండడంతో ఆశించిన ఫలితం కనిపించడం లేదు. ఆయకట్టు పరిధిలోని చెరువుల్లోనూ నీటి నిల్వలు అడుగంటి పోతుండడంతో భూగర్భ జలాలపై ప్రభావం పడింది. బోర్లు, బావుల్లోనూ నీటి లభ్యత క్రమంగా పడిపోతున్నది. ఫిబ్రవరి రెండో వారం నాటికి అటోఇటో పంటను కాపాడుకున్నా మూడోవారం వచ్చేసరికి నీటి లభ్యత లేక కష్టంగా మారింది.

మరింత అగాధంలోకి రైతులు

భూమినే నమ్ముకున్న రైతులు బోర్లు, బావుల కింద పంటను సాగుచేసి చివర్లో ప్రభుత్వం ఒకటో రెండో తడులకు నీళ్లు ఇవ్వకపోతదా? అన్న ఆశతో ఉన్నారు. అయితే, ఆలోపే ఎండుతున్న పంటను కాపాడేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వేసిన బోర్లల్లో నీరు రాక ఆర్థికంగా నష్టపోతున్నారు. రెండెకరాలు ఉన్న రైతు కూడా పంటను కాపాడుకునేందుకు రూ.50 వేలకు పైగా ఖర్చు చేసి బోర్లు వేయిస్తున్నారు. వేలకు వేలు ఖర్చు చేసిన బావు ల్లో పూడికతీతతో పాటు క్రేన్ సాయంతో లోతు తవ్విస్తున్నారు. గత ఐదేండ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి రాలే.

18 ఏండ్లు బోసిపోయిన కాల్వలు

ఉమ్మడి రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మండలంలో తవ్విన కాల్వలు దాదాపు 18 ఏండ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి 405 కిలోమీటర్ల దూరంలోని పెన్‌పహాడ్ మండలానికి సాగునీరు అందించింది. మరోపక్క నాగార్జునసాగర్, మూసీ జలాలు అందడంతో మూడున్నరేండ్లుగా పుష్కలంగా పంటలు పండాయి. మూడు నదులు పారే అవకాశం ఉన్న ఈ మండలంలో ఇప్పుడు కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. ప్రధానంగా కాళేశ్వరం నీటికి కోత పెట్టడంతో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతున్నది. గతంలో కాళేశ్వరం నుంచి వచ్చే గోదావరి జలాలను ఆయకట్టు పరిధిలో వారాబందీ ప్రకారం ఏడు రోజుల చొప్పున ఆరు విడుతల్లో అందించారు. 42 రోజుల పాటు రోజుకు 2500 క్యూసెక్కుల చొప్పున వారానికి 17,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రోజుకు 1800 చొప్పున వారానికి 10,800 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. వారానికి 6500 చొప్పున ఆరు వారాలకు 39వేల క్యూసెక్కుల నీటికి కోత విధించడంతో శివారున ఉన్న పెన్‌పహాడ్ మండలంలోని భూములకు నీరు అందడం లేదు.

నల్లగొండ జిల్లాలో బోరు వేయించుకుంటున్న రైతు

బోర్లబాటలో మండలాలు

వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామ రైతులు ఫిబ్రవరిలో ఏకంగా 100 బోర్లు వేసుకున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామంలో 1,800 మంది రైతులు ఉండగా, ప్రసుత్త యాసంగిలో 744 మంది వరి పంట సాగుచేశారు. గ్రామంలో ఇటీవల వంద బోర్లు వేస్తే 20 బోర్లలో చుక్క నీరు పడలేదు. వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామంలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడి రైతులు నెల రోజుల్లో 50 బోర్లు వేయించారు. వందల అడుగులు డ్రిల్లింగ్ వేస్తున్నా నీళ్లు పడడం లేదు. ఒక్కో రైతు ఐదారు బోర్లు వేయిస్తున్నా నిరాశే మిగులుతున్నది. వీపనగండ్ల, చిన్నంబాయి, పెద్దమందడి, కొత్తకోట, పాన్‌గల్ మండలాల్లో కొత్త బోర్ల తవ్వకం జోరుగా సాగుతున్నది. ఏదుట్లలో ప్రకాశ్‌శర్మ ఒక్కడే 5 బోర్లు వేశాడు.

కనిష్ఠస్థాయికి నీటి నిల్వలు

గడిచిన ఐదేండ్ల భూగర్భ జలాల గణాంకాలకు భిన్నంగా ఈసారి నీటి నిల్వలు మరింత కనిష్ఠస్థాయికి చేరుకున్నాయి. ఏటా జనవరిలో చేసే సర్వే ప్రకారం జిల్లాలో సగటున 4.46 మీటర్ల లోతులో నీటి లభ్యత ఉంటుంది. కానీ, ఈ ఏడాది అది 5.46 మీటర్లకు పడిపోయింది. సత్తుపల్లి, ఎర్రుపాలెం, సింగరేణి, కామేపల్లి, ఏన్కూరు వంటి మండలాల్లో భూగర్భ జలాలు మరింత తగ్గాయి. మార్చి నెల చివరి నాటికి ఇవి మరింత తగ్గే ప్రమాదముందని సంబంధిత అధికారులు చెప్తున్నారు.

గత ఐదేండ్ల నీటి లభ్యత వివరాలు ఇలా

సంవత్సరం	నీటి లభ్యత మీటర్లలో
2020-జనవరి	4.93
2021-జనవరి	3.83
2022-జనవరి	4.56
2023-జనవరి	4.46
2024-జనవరి	5.46

కాంగ్రెస్ తెచ్చిన కరువు

బోర్లు వేస్తూ అప్పులపాలు

నీటి కోసం రైతులు ఎడాపెడా బోర్లు వేస్తుండడంతో మళ్లీ అప్పులపాలవుతున్నారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో యాసంగి సాగుబడులున్నాయి. వీటిలో వరి 50 వేల ఎకరాల్లో సాగవగా, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలు మరో 50 వేల ఎకరాల్లో సాగయ్యాయి. జూరాలతోపాటు భీమా, ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టుల నుంచి సాగునీటి విడుదల పూర్తిగా నిలిచిపోయింది. యాసంగిలో కొంత వరకైనా నీటి విడుదల ఉంటుందని ఆశించిన రైతులకు నీళ్లు లేవని చెప్తూ సర్కారు చేతులెత్తేయడంతో బోరు, బావుల ఆధారంగా పంటలు సాగుచేసిన రైతులు అవస్థలు పడుతున్నారు. నీరు లేక పంటను వదిలేశారు. మరికొందరు పంటలను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు.



నీళ్లు లేక యాసంగి వేయలేదు

నీళ్లు లేక మా తుమ్మలచెరువు కింద ఈసారి యాసంగి వేయలేదు. మా చెరువు ఏటా ఎనిమిది వేల ఎకరాలకు సాగునీరు అందిస్తుంటుంది. ప్రస్తుతానికి చెరువు కింద సగం భూములకు మాత్రమే సాగునీరు అందుతున్నది. ఈ యాసంగిలో సుమారు నాలుగు వేల ఎకరాలు బీడు భూములుగా మారాయి.

-వేల్పుల ఉప్పలయ్య, రైతు, మొండికుంట, అశ్వాపురం మండలం, భద్రాద్రి జిల్లా

నీళ్లు అడుగంటాయి

గీ సమయంలో భూగర్భ జలాలు అడుగుంటిపోతాయని ఎప్పుడు అనుకోలే. నిరుడు ఈ సమయంలో నిండుగా వరిపొలం పారింది. ఇప్పుడు నీరు లేక ఉన్న బోరు ఎత్తిపోవడంతో బావిలో పూడికతీత పనులు చేసిన. ఇప్పటివరకు రెండు ఎకరాలు నాటు వేసిన. పొట్టదశలో ఉన్న పంటకు సరిగా నీరు అందుతలేదు.

- గాజుల సిద్దిలింగం, సిద్దెంకి, జనగామ

ఐదేండ్లుగా ఎండిపోలే

ఐదేండ్లలో బావిలో నీరు తగ్గింది లేదు. పంట ఎండిపోయింది లేదు. కాలువల్లో ఎప్పుడు చూసినా నీరు వచ్చేది. ఈ యేడు యాసంగి సాగుకు నీరు ఇస్తామన్నారు. వరి వేసి రెండు నెలలైంది. ఇప్పుడే పంటకు నీరు అందక ఇబ్బంది అవుతాంది. ఇంకా నెలపదియేను రోజులు పంటకు నీళ్లు పెట్టుడు ఇబ్బందే.

- బదావత్ బుగ్గ, పుసలితండా, మహబూబాబాద్ జిల్లా

మూడు బోర్లు వేసినా

ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు జే ధర్మయ్య. వనపర్తి జిల్లా గోపాలపేట మండలంలోని ఏదుట్ల. తనకున్న మూడెకరాల తోపాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశాడు. ఎంజీకేఎల్ఐ డీ-8 కాల్వ రెండు నెలల క్రితమే బందైంది. ఉన్న ఒక్క బోరు ఎండిపోయింది. గత్యంతరం లేక రూ. 1.2 లక్షలతో ఇటీవలే మూడు బోర్లు వేశాడు. రెండుబోర్లలో చుక్కనీరైనా పడలేదు. ఇప్పటికే మూడెకరాల్లో వరిని వదిలేసుకున్నాడు. ఉన్న పంటనై చేతికి వస్తుందో, లేదోనన్న అయోమయంలో ఉన్నాడు.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

సీపీపీఆర్ఐలో సెక్షన్ ఆఫీసర్ పోస్టులు..

సెంట్రల్ పల్ప్ అండ్ పేపర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 2
- పోస్టులు: సెక్షన్ ఆఫీసర్
- అర్హతలు: డిగ్రీ ఉత్తీర్ణత, కంప్యూటర్ అప్లికేషన్ కోర్సు సర్టిఫికెట్ ఉండాలి
- అడ్మినిస్ట్రేషన్ లేదా ఫైనాన్స్ అండ్ అకౌంట్స్‌లో అనుభవం ఉండాలి.
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరి తేదీ: 30 రోజుల్లో పంపాలి
- వెబ్‌సైట్: https://cppri.res.in

ఎన్ఐఏబీలో..

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- మొత్తం ఖాళీలు: 3
- పోస్టులు: క్లర్క్, మెయింటెనెన్స్ ఇంజినీర్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరి తేదీ: మార్చి 22
- వెబ్‌సైట్: http://www.niab.org.in

పీఎఫ్‌సీలో..

పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (పీఎఫ్‌సీ)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- పోస్టులు: కో ఆర్డినేటర్ (లెవల్ 1, 2, 3)
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరి తేదీ: మార్చి 7
- వెబ్‌సైట్: https://www.pfcindia.com

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల